# తొలి వెలుగు

## మలుపు

సీతారామయ్య వాలుకుర్చీలోపడుకుని ఆకాశంలో పరుగెత్తే మేఘాలు చూసి ఒక్క నిట్టూర్పువిడిచాడు. అందని మేఘాల్లాగే తన జీవితంలో ఆశలు ఉంటున్నాయని కొంత విచారించాడు. చిన్నప్పుడు స్కూలు ఫైనలు ప్యాసయి, కొంత ఆర్జనచేసి, తండ్రియిచ్చిన కొద్దిఎకరాల మాగాణి ఆదాయం వడ్డీకితిప్పి కొద్దోగొప్పో బ్యాంకులో నిలువచేశాడు, అయితే అతని జీవితాశయం లక్షాధికారికావాలని. ఒకపైస ఖర్చుపెడితే దానివల్ల వచ్చే ఆదాయం ఏమన్నాఉందా అని పదిరెట్లు తర్జనభర్జనచేసికాని, ఆ పైస వదలడు అతను,

వడ్డీ వ్యాపారంతోపాటు, సులువుగా ఏవిధంగా డబ్బు సంపాదించ గలమా అని ఆయన తాపత్రయం. కొన్ని కోర్టుకేసుల్లో సలహాలుచెప్పి, ఆపక్షానికీ ఈపక్షానికికూడా మంచిగాఉండి, ధనాదాయం కూడబెట్టుకున్న సంఘటనలు లేకపోలేదు. వరండాలో చుట్టముట్టించి అకాశంనుంచి దృక్కులు టేబిలుమీద వార్తాపత్రికవైపు మళ్ళించాడు అతను.

'చైనావారిని విశ్వసించరాదు!' 'రెండువేలు దేశరక్షణనిధివసూలు' 'సర్వసైన్యాధికారి డార్జిలింగుపర్యటన' రక్షణమంత్రి ఉపన్యాసం. 'దేశ రక్షణకు అందరూ త్యాగంచెయ్యాలి!' పత్రికలో ఈ పెద్దఅక్షరాలు చూసి మరీ నిరాశగా వార్తాపత్రిక కిందజారవిడిచాడు సీతారామయ్య. ఈతరంలో పుట్టివవారంతా దురదృష్టవంతులని సీతారామయ్యభావం. పూర్వకాలంలో

ఏకొద్దిసంపాదించినా సుఖంగా కాలం గడిచేదనీ, యీ రోజుల్లో ఏవో విపత్తులు అస్తమానూ మానవసముదాయాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తూండడం వల్ల. జీవితంలో ప్రగతిఅనేదిలేక స్థాణువుల్లా బ్రతకడం జరుగుతోందని అతనిఊహ. మనిషిలో ప్రగతికి అతను యిచ్చే నిర్వచనం బ్యాంకులో లెక్కపెరగటం అన్నమాట. అయితే బ్యాంకుఎంతచూపించినా నిరాడంబర జీవితం, ఉన్నత ఆలోచనాభావం, భారతీయ సంప్రదాయం అనే వాదన మీద ఆధారపడడం అతనికిష్టం. రోజూ అతనుచేసే సంపాదనలో 1వ శాతంమాత్రమే ఖర్చుజరగాలని గట్టిపట్టు పడతాడు. ఆమధ్య సీతయ్య వచ్చి యుద్ధరక్షణనిధికి ఏమైనా యివ్వవయ్యాఅంటే రెండురూపాయిలిచ్చి, కాస్త స్థానికపత్రికలో తనపేరు పడకూడదా అన్నాడు. పది రూపాయలిస్తేకాని పేరు వెయ్యడానికి వీలులేదంటే, తనకు ఉండవలసిన పేరు ఎలాగాఉందికనుక, యింక పేరువెయ్యక్కర్లేదని ఖచ్చితంగాచెప్పేశాడు. కానీ డబ్బుమాత్రం ఎక్కువయివ్వలేదు.

సరిగ్గా సీతయ్య అదేసమయానికి మళ్ళీవచ్చాడు, సీతయ్యవస్తే, సీతారామయ్యకు ఎంతో ఆనందం, కాని సీతయ్య ఆఊళ్ళో ప్రజా కార్యక్రమాల్లో ఎన్నింటిలోనో పాల్గొంటూంటాడు. ఎప్పుడూ ఏదోచందాలనో టిక్కట్టులనో, సీతారామయ్య నెత్తిమీద పెట్టడానికి ప్రయత్నిస్తూనే ఉంటాడు, అయితే స్నేహంచనువుతో, సీతారామయ్య దాన్ని నెట్టివేయడమో, లేక కాస్త ఖర్చుపెట్టి సీతయ్యని సంతోషపెట్టడమో జరుగుతూనేఉంది.

సీతయ్యా! ఏమిటి విశేషాలు? అన్నాడు సీతారామయ్య.

స్థానిక రాజకీయాలు, ఊళ్లోవింతలు వరుసగా ఏకరువుపెట్టాడు సీతయ్య. అల్లా కబుర్లు చెప్పుకుంటూ ఎన్నో సాయంత్రాలు గడిపారు

వారిద్దరూ, యింతకుముందు. అన్నికబుర్లూ అయ్యాక సీతయ్య జేబులోంచి ఒక పుస్తకంతీసాడు.

'చూడు సీతారామయ్యా! ఇది రేఫిల్‌పుస్తకం. లాటరీ అన్నమాట. ఒక్కరూపాయికొంటే, ఏభయివేల రూపాయలురావచ్చు'.

'రావచ్చు. కాని వస్తాయా! ఎందుకూ? దండుగ!' అన్నాడు సీతారామయ్య.

'అదికాదయ్యా! డబ్బున్నవాళ్ళకే డబ్బు వస్తుంది, డబ్బులేని వాళ్ళకు డబ్బురాదు. అందుకే నువ్వుకొంటే బాగుంటుందని (ఒకపుస్తకం కనీసం) నాభావం. ఏమంటావు?'

'ఎందుకు! పోనీలెద్దూ...' పెదిమ విరిచాడు సీతారామయ్య!

'ఇదిగో! వచ్చేఅదృష్టం పోగొట్టుకోకు! హెచ్చరించాడు సీతయ్య! నవ్వాడు సీతారామయ్య.

అది అర్థంచేసుకున్న సీతయ్య తక్షణం పుస్తకంఅందించి. ఒక్క పది రూపాయి లిమ్మన్నాడు.

'అదికాదోయి! ఒక్క టిక్కట్టివ్వచాలు! సీతారామయ్య ముఖం చిట్లించాడు.

ఒంటెకు సందుదొరికినట్లు మొదట సీతయ్య ఒక్క టిక్కట్టు చించాడు.

'నాన్నా! కాఫీకావాలా అంటూంది అమ్మ' అంటూ సీతారామయ్య చిన్నకూతురు దగ్గరగావచ్చింది.

'ఈపిల్ల చాలా అదృష్టవంతురాలు! ఈమెపేరుమీద ఒకటిక్కట్టు కొనకూడదూ! ఏటిక్కట్టులో అదృష్టంఉందో! అన్నాడు సీతయ్య.

సీతారామయ్య బుర్ర ఏభయివేలమీద పనిచేస్తోంది!

'ఏంటి బాబయ్యా!' అంటూ చిన్నపిల్ల సీతయ్యదగ్గరికి వచ్చింది.

అదే అదనని సీతయ్య పిల్ల పేరు రేఫిలులో టిక్కట్టు కోసాడు తర్వాత సీతారామయ్య భార్య లోపలినుంచి ఆయన్ను పిలిచింది. లక్ష్మి లాంటి ఆయిల్లాలిపేర మరొకటీ! అన్నాడు సీతయ్య. అల్లాగ మొత్తం మీద యింటిల్లిపాదినీ అందులో యిరికించి, సీతారామయ్యదగ్గర ఒక పుస్తకం ఖాళీచేసాడు సీతయ్య. పెద్దకొడుకు గోపాలం పేరకూడా ఒక టిక్కట్టుకోసేడు ఆసందడిలో. గోపాలంవచ్చాడు. యీసంగతివినినవ్వాడు. నాన్న పోగుచేసింది కాస్తయిలా ఖర్చుపెట్టేస్తే, ఆతర్వాత బహుమతి రాకపోతే ఒక వారంరోజులు ఆయన బాధపడరూ! అన్నాడు గోపాలం వేళాకోళంగా.

'ఓయబ్బో! చూస్తాగా నువ్వు సంపాదన చేసినప్పుడు ఎలా ఖర్చు పెడతావో!' సీతారామయ్య కొడుకును హాస్యంగానే మందలించాడు.

పని పూర్తిచేసుకుని, సీతయ్య స్నేహితుడు భార్యపెట్టిన వేడివేడి పెసరెట్లు రుచిచూసి, ఆనందించి గుటకలువేసుకుంటూ నిష్క్రమించాడు.

* * * *

సీతారామయ్య తీసుకొన్న రేఫిల్ టిక్కట్టు నెంబరు పదిసార్లు చూసి ఏదో లెక్కలు కట్టాడు. అంకెలశాస్త్రం ప్రకారం టిక్కట్టు నెంబరు కొంత శుభప్రదంగానే కనిపించింది. పూర్తి బహుమతి వస్తే ఏడు కొండలస్వామి దర్శనం చేసుకుని ఒక వెయ్యి రూపాయిలైనా హుండీలో వేసేస్తానని కూడా మ్రొక్కుకున్నాడు సీతారామయ్య.

నిజంగా బహుమతివస్తే, కొన్ని బంగారు నగలు చేయించు కుంటూంది సీతారామయ్య భార్య. బంగారం ఎందుకే యీ రోజుల్లో బంగారం మనం వాడకూడదు, కొనగూడదు, అందువల్ల నగలు చేయించను! అన్నాడు నిక్కచ్చిగా సీతారామయ్య. 'ఆలు లేదు. చూలు

లేదు. కొడుకు పేరు సోమలింగం అన్నట్లు అసలు బహుమతి రానీండి చూదాం' అని ఆ విషయం త్రుంచేసింది అతని భార్య చిరాగ్గా.

నిజంగా తన టిక్కెట్టు మీద బహుమతి వస్తే అసొమ్ము సద్విని యోగం చెయ్యాలని గోపాలం అనుకున్నాడు? ఏది ఈరోజుల్లో సద్విని యోగం? అన్న ప్రశ్న అతన్ని ఎంతో సతమతం చేసింది. అసలు ఏ బహుమతీ రాకముందే యీ ఆలోచన ఎందుకు అనుకున్నాడు గోపాలం చివరకు!

సీతారామయ్యకు ప్రతి రోజూ తెల్లవారు ఝాము ఏవో కలలు వచ్చేవి...మసకమసకగా ఏడు కొండలవాని నామం అందులోంచి కనక వర్షం...ఆ కాసులు సీతారామయ్య ఏరుకున్నట్లు... మరోసారి తాను నదిలో మునిగిపోయి లోపలికి దిగబడినట్లు తర్వాత ఏదో ముత్యాల గుట్ట చూసి ఒడినింపుకుని తూగుటుయ్యాలలో – తాంబూలం వేసుకుని హాయిగా...యింతలో మెలకువ...ఇలా ఎన్నో కలలు...

రావలసిన రేఫిల్ డ్రా తేదీ వచ్చేసింది. సీతయ్య యింటిచుట్టూ రెండుసార్లు తిరిగాడు సీతారామయ్య. బస్తీలో ఏదైనా బహుమతులు యిచ్చినట్లు తెలిసిందో అని... అనేక ప్రశ్నలు వేశాడు... నిజంగా బహుమతి వస్తే టెలిగ్రాం వస్తుందిగా అనితెలుసుకుని కొంత ఆశగా రోజల్లా పోస్టుమేన్ లాంటివాడు ఎవరైనా తన యింటికి వస్తున్నాడా అని తెగచూశాడు...కాని లాభం లేకపోయింది...

*　　*　　*　　*

నాల్గు రోజులు గడిచాయి. గోపాలం పేర ఒక ఉత్తరం వచ్చింది. ఓ సాయంత్రం, గబగబా సీతారామయ్య విప్పి చదివాడు గోపాలం యింట్లో లేకపోవడంతో చదివి సీతారామయ్య కొంత విచారం, మరి కొంత ఆనందంవ్యక్త పరిచాడు తన వదనంలో. ఎనిమిదివేల రూపా యిల బహుమతి గోపాలానికి వచ్చినట్లు తెలియచేశారు రేఫిల్ సంఘం

వారు. పెద్ద బహుమతి పోయినందుకు విచారం, పది రూపాయిల పెట్టు బడి మీద ఎనిమిది వేల రూపాయిలు వచ్చినందుకు సంతోషం సీతా రామయ్యలో ద్యోతకమయ్యాయి. గోపాలం రాగానే యీ శుభవార్త అందించి, ఈ సొమ్ము ఏ విధంగా ఏ వ్యాపారంలో పెడదామా అని ఎన్నో ఆలోచనలు చేసాడు సీతారామయ్య.

సీతయ్య యింటికి వచ్చాడు సాయంత్రం మామూలు ధోరణిలో. గోపాలం పొందిన బహుమతికి సీతయ్య అతన్ని అభినందించాడు. బస్తీ వెళ్ళి బహుమతి తెచ్చుకుంటానన్నాడు గోపాలం. ఆ ఖర్చు ఎందు కురా! యింటికి చెక్కు పంపమని రాయి అన్నాడు. సీతారామయ్య. ససేమిరా బస్తీ వెళ్ళాలి అన్నాడు గోపాలం. సీతయ్య కూడా బస్తీ వెడుతున్నానని కావాలంటే కలిసి పోదామన్నాడు. దానితో గోపాలం ప్రయాణం ఆప లేకపోయాడు సీతారామయ్య పోనీ ప్రయాణం ఖర్చులు ఏభయి రూపాయలుపోయినాచివరకు ఏడువేల తొమ్మిది వందల ఏభయి అయినా తెచ్చి కొడుకు ఒళ్ళో గుమ్మరిస్తాడు కదా అని సంతోషించాడు సీతారామయ్య. మర్నాడు సీతయ్య, గోపాలం బస్తీ వెళ్ళారు.

బస్తీలో డబ్బు తీసుకుని, వింతలు విశేషాలు చూసి, సాయంత్రం పార్కులో కూర్చున్నారు యిద్దరూ చల్లగాలి సేవిస్తూ. మరో గంటలో ఎదురుగా ఎవరో గొప్ప భారతీయుడు ఉపన్యాసం యిస్తారని విన్నారు. వారిద్దరూ, అ ఉపన్యాసం కూడా వినిపోదామని అనుకున్నారు యిద్దరూ.

'బహుమతి ఏం చేస్తావు' అన్నాడు సీతయ్య గోపాలంతో.

'ఏం చేస్తాను, నాముందు చదువులకు ఉపయోగిస్తుంది!' అన్నాడు ముభావంగా గోపాలం.

ఎదురుగా లౌడ్‌స్పీకర్ గింగురుమని మ్రోగుతోంది. దేశమంటే మట్టి కాదోయి పాట ఎవరో పాడారు...ప్రక్కనే ఒక పెద్ద బోర్డు మీద 'మీ దేశరక్షణకు ఏమిస్తారు? విరివిగా విరాళాలివ్వండి!' అంటూ త్రివర్ణ పతాకం ఎగురవేస్తూ ఒక యువకుడు వడిగా నడుస్తున్నదృశ్యం... మరో వైపు మీదేశంకోసం సైన్యంలోచేరండి... ఒక సైనికునిబొమ్మ తుపాకీ పట్టుకుని కనిపించింది...'జనగణమన' గీతం జ్ఞాపకంవచ్చింది గోపాలానికి...గాంధీజీవితచరిత్ర, స్వతంత్రపోరాటంనాటి భారతీయుల మనుగడ తలలోతిరిగింది...ఎదురుగా జనసందడిపెరిగింది. ఒకభారతీయ యువకుడు విదేశాలనుంచి చదువు పూర్తిచేసుకువచ్చి రాజకీయాల్లో చేరి దేశరక్షణ ఉద్యమానికి చేయూతయివ్వాలని దేశంఅంతా పర్యటిస్తున్నాడు... అతని ఉపన్యాసం గంభీరంగా నడిచింది...మిత్రద్రోహి—వెన్నుపోటు. ప్రక్క స్నేహితుడుబల్లెం...మాటలు వినిపించాయి... అన్నిటికంటె ముఖ్యం దేశం...ప్రతీవాడు తన దేశశ్రేయస్సుకాంక్షించాలి. ప్రతీమనిషి రక్తం పొంగి, దేశస్వాతంత్ర్యానికై అవసరమైతే, దీక్షతో యుద్ధంచెయ్యాలి... ప్రతీభారతీయుడు ఒక వీరుడు...అతని ఉపన్యాసం గోపాలం మనస్సులో ఏవోపరవళ్ళు త్రొక్కించింది. అతను ఉద్రేకంతో ఉక్కిరి బిక్కిరి అయ్యాడు... ఆ ఉపన్యాసకుడు...మెళ్లోవేసినదండతీసి వేలంపాడాడు... ఒకవంద...రెండు...మూడు...వందలు...నాల్గువేలు ... కోమట్లు... రాజకీయవేత్తలు ముందుకువచ్చారు...ప్రక్కన మంత్రిగారు వేలంపాట హెచ్చించారు...కోటిరూపాయలకుకూడా ఒకమంచివిమానంరాదు...యీ సొమ్మెంత? మీదేశాన్ని ఎలా ఉద్ధరిస్తారు? ఆఉద్వేగమైన ప్రశ్న గోపాలం నరనరాల్లో ఉత్సాహం రేకెత్తించింది... ఎనిమిది వేలు అరిచాడు గోపాలం... అందరూ నిశ్చేష్టులై వెనక్కుచూశారు ... మంత్రిగారు గోపాలంమెడలో పూలదండవేశారు...గోపాలం అప్రయత్నంగా జేబులో

ఉన్న 8 వేల రూపాయలసొమ్ము తక్షణం అందజేశాడు. కరతాళధ్వనులు మిన్నుముట్టాయి. గోపాలం పేరుతో జయజయధ్వానాలు మిన్నుముట్టాయి. అప్రయత్నంగా వచ్చిన సొమ్ము సద్వినియోగం అయిందనుకున్నాడు గోపాలం.

ఇది సీతయ్యచూసి ఆశ్చర్యపోయాడు... ఏదో చందాలువోగుచేసి తాను చేస్తున్న సేవ ఘనంగా చెప్పుకునే అతనికి గోపాలం త్యాగం కళ్లు తెరిపించింది. అతని హృదయానికి హత్తుకుని ఆనందభాష్పాలు రాల్చాడు. 'చేసినపని చాలాబాగుందికాని—మీనాన్న ఏమంటాడో?' అన్నాడుసీతయ్య.

'ఏమంటాడు?... ఏమనడానికీ వీలులేకుండా ఒకటినిశ్చయించాను· ఇక్కడే సైన్యంలోచేరి ఇక్కడినుంచే వెళ్ళిపోతా ఎక్కడికైనా?తర్వాత ఆయనకి ఉత్తరంరాస్తా!...' అన్నాడు గోపాలంనవ్వుతూ.

సీతయ్య విస్తుపోయాడు. దేశం రక్షించండని ఉపన్యాసాలివ్వడం తప్ప. తనే సైన్యంలోచేరడానికి సీతయ్య సాహసించలేకపోయాడు. గోపాలం నిశ్చయంచూసి నిర్విణ్ణుడై కొంచెం సిగ్గుపడ్డాడు... ఇద్దరూకలిసి పార్కు బయటికివచ్చారు...గోపాలందృష్టిలో...త్వరలో కాకీదుస్తుల్లో లెఫ్టురైట్...దృశ్యంకనిపించింది .. సీతయ్య తనతండ్రికి ఈ వార్త అందించగానే... మొదట సీతారామయ్య చికాకుపడి, కోపం తెచ్చుకుని, కొడుకు సైన్యంలోచేరినందుకు శోకించి ... చివరకు డబ్బుపోయినా ఫర్వాలేదు. కొడుకు క్షేమంగాఉంటేచాలని బెంబేలుపడ్డదృశ్యం... అతని కనులముందుతిరిగింది. గోపాలం ఆనందంగా హాయిగా నవ్వుకున్నాడు... అది తనజీవితంలో ఒక మహత్తర ఘట్టం; తొలి వెలుగు మలుపు అనుకున్నాడు అతను.